సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 17 । మే । 2024



4,28,612 మంది ఓటెయ్యలే..!

ఈ నెల 13న జరిగిన ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో 4,28,612 మంది ఓటు వేయకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. 8లో▸



ప్రజల దాహం తీరేదెలా? 9లో▸

ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి దాహం తీర్చేవారు.

గరిష్టం/కనిష్టం
35.0/25.0

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా జడ్జిని కలిసిన డీఎఫ్‌వో



జడ్జికి మొక్క ఇస్తున్న డీఎఫ్‌వో

కైలాస్‌నగర్: జిల్లా జడ్జిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కే.ప్రభాకర్‌రావును జిల్లా అటవీశాఖ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో జడ్జిని కలిసి పూలమొక్క అందజేశారు.

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశానికి దరఖాస్తులు

ఆదిలాబాద్‌రూరల్: 2024–25 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశానికి అర్హత గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి సునీత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో 1వ తరగతి (డే స్కాలర్), 5వ తరగతి (రెసిడెన్షియల్)లో ప్రవేశాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. 1వ తరగతిలో 45 సీట్లు, ఐదో తరగతిలో 47 సీట్లు ఉన్నట్లు తెలిపారు. వార్షిక ఆదాయం గ్రామీణ స్థాయిలో రూ.లక్షా 50వేలు, పట్టణ స్థాయిలో రూ.2 లక్షల ఉండాలన్నారు. అన్ని ధ్రువీకరణ పత్రాలను గెజిటెడ్ అధికారిచే అటెస్ట్ చేసి జూన్ 7వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని, ఇతర వివరాల కోసం 9440628538 నంబరులో సంప్రదించాలని సూచించారు.


సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

ఉట్నూర్‌రూరల్: సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయ్‌కుమార్ అన్నారు. గురువారం డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉట్నూర్ మండలంలోని తాండ్రలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది గ్రామాల్లో ఎప్పటికప్పుడు పర్యటించాలన్నారు. అనారోగ్యం బారిన పడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందేలా చూడాలన్నారు. దోమల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

‘1/70 చట్టం పకడ్బందీగా అమలు చేయాలి’



మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

నార్నూర్: ఏజెన్సీలో 1/70 చట్టం పకడ్బందీగా అమలు చేయాలని తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్ అన్నారు.గురువారం మండల కేంద్రంలోని కుమురంభీం భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13న కుమురంభీం జిల్లా జైనూర్ మండల కేంద్రంలో ఆదివాసీ యువకుడిపై మైనార్టీల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మెస్రం మానిక్‌రావు, శ్రీరామ్, పెందూర్ దీపక్, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి లోనుకావద్దు

ఆదిలాబాద్‌రూరల్: వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకావద్దని ప్రముఖ సైకాలజిస్ట్ వీరేందర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు అవగాహన కల్పించారు. అలాగే జ్ఞాపకశక్తి ఎలా పెంచుకోవాలో వివరించారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, అభ్యర్థులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌రూరల్ మండలం కచికంటి వ్యవసాయ భూమిలోని వ్యర్థాలను ఏరివేస్తున్న రైతులు

సాగుకు సన్నద్ధం

- నైరుతి రుతుపవనాల ఆగమనం త్వరగానే ఉంటుందనే సంకేతాలు
- ఈ వానాకాలం మొత్తం విస్తీర్ణంలో 70 శాతానికి పైగా పత్తి సాగే
- డిమాండ్ పత్తి విత్తనాలు దొరకడం లేదంటున్న రైతులు
- వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపణ
- మరోవైపు నాణ్యమైన విత్తనం కొరత ఉందనే ప్రచారం

సాక్షి, ఆదిలాబాద్: ముందున్న వానాకాలంలో పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే చేలల్లో పంట వ్యర్థాలను పూర్తిగా ఏరివేసి దుక్కులు దున్ని చదును చేస్తున్నారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు సంసిద్ధులవుతున్నారు. ఇదిలా ఉంటే గడిచిన శుక్రవారం అక్షయతృతీయ రావడంతో జిల్లాలో రైతులు ఆనవాయితీగా విత్తనాల కొనుగోలును ప్రారంభించారు. అయితే రైతులు కోరే డిమాండ్ ఉన్న పత్తి విత్తనాలు మార్కెట్లో దొరకడం లేదనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఆ విత్తనానికి సంబంధించి ప్రొడక్షన్ పరంగానే కొరత ఉందా? లేనిపక్షంలో మార్కెట్లో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా? అనే అపవాదు కూడా లేకపోలేదు. ఈ విషయంలో జిల్లా అధికారులు దృష్టి సారించి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాలన్న అభిప్రాయం అందరి నుంచి వ్యక్తమవుతోంది.

పత్తి సాగే అధికం..

జిల్లాలో ప్రధాన పంట పత్తే. ఈ వానాకాలంలోనూ రైతులు ఆ పంట సాగు పట్లనే మొగ్గు చూపుతుండడంతో ఈసారి విస్తీర్ణం మరింతగా పెరిగే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యవసాయ శాఖ అధికారులు వ్యక్తం చేస్తున్నారు. దీనికి కారణం లేకపోలేదు.. గడిచిన సంవత్సరం పత్తికి మంచి ధర రావడం, చివరి వరకు మద్దతు ధర లభించే పరిస్థితి ఉండడంతో రైతులు ఈయేడు కూడా పత్తి సాగును నమ్ముకొని ముందుకు సాగుతున్నారు. సాగు విస్తీర్ణం అంచనాలో 70 శాతానికి పైగా పత్తే ఉండటం గమనార్హం. ఆ తర్వాత సోయాబీన్, కందులు సాగు చేస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా వర్షాధారంగానే 90 శాతం మంది రైతులు పంటలు పండిస్తున్నారు.

వానాకాలంలో పంటల సాగు విస్తీర్ణం అంచనా..

పంట	సాగయ్యే విస్తీర్ణం (ఎకరాల్లో)
పత్తి	4,16,969
సోయాబీన్	91,762
కందులు	61,246
మొక్కజొన్న	4,140
జొన్న	2,068
వరి	1,823
మినుములు	850
పెసర్లు	667
ఇతర పంటలు	21
మొత్తం సాగు విస్తీర్ణం	5,79,546

విత్తనాల అవసరం అంచనా..

పంట	అవసరం
పత్తి	10,42,422ప్యాకెట్లు
సోయాబీన్	27,529 క్వింటాళ్లు
కందులు	24,498 క్వింటాళ్లు
మొక్కజొన్న	331 క్వింటాళ్లు
జొన్న	83 క్వింటాళ్లు
వరి	456 క్వింటాళ్లు
మినుములు	680 క్వింటాళ్లు
పెసర్లు	27 క్వింటాళ్లు
ఇతరత్రా	7 క్వింటాళ్లు

ఎరువుల అవసరం అంచనా..

ఎరువు	ఆవశ్యకత (మెట్రిక్ టన్నుల్లో)
యూరియా	30వేలు
డీఏపీ	13వేలు
ఎంఓపీ	7వేలు
ఎన్‌పీకేఎస్	36వేలు
ఎస్ఎస్‌పీ	4వేలు
మొత్తం	90వేలు

నీటి వసతి అంతంత మాత్రంగానే ఉండడంతో జిల్లాలో ప్రతియేడు రైతులు వర్షాన్ని నమ్ముకొని పంటల సాగును కొనసాగిస్తారు. ఈసారి నైరుతి రుతుపవనాలు త్వరగానే వస్తాయనే సంకేతాలతో రైతులు సాగు సన్నద్ధాన్ని మరింత వేగం చేశారు.

ఒక విత్తనం అడిగితే దాంతోపాటు ఇతర విత్తనాలు..

రైతులు కోరే విత్తనాలే అందుబాటులో..



రైతులు కోరే డిమాండ్ విత్తనాలే మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. నాణ్యమైన విత్తనాలు అందించేందుకే మా ప్రయత్నం. 10 లక్షలకు పైగా పత్తి విత్తనాల ప్యాకెట్లు అవసరం ఉండగా ఇప్పటి వరకు సుమారు మూడున్నర లక్షలు మాత్రమే వచ్చాయి. జూన్ రెండు, మూడో వారంలో రైతులు పత్తి విత్తనాలను కొనుగోలు చేస్తారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచేలా చూస్తున్నాం. – పుల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి, ఆదిలాబాద్

జిల్లాలో పత్తి రైతులు ప్రధానంగా ఒక కంపెనీకి చెందిన నాణ్యమైన విత్తనం కొనుగోలుకు ప్రతియేడు ఆసక్తి కనబరుస్తారు. ప్రధానంగా ఆ విత్తనం ఇక్కడి నల్లరేగడి, ఎర్ర నేలలు, ఎలాంటి నేలల్లోనైనా వృద్ధి చెందడం, పత్తి కాయల సైజు కూడా పెద్దగా ఉండటం, అమితంగా కాయలు రావడం, దిగుబడి కూడా హెచ్చుగా ఉండడంతో రైతులు ఆ విత్తనమే కావాలని డిమాండ్ చేస్తారు. గడిచిన అక్షయ తృతీయ రోజు ఆదిలాబాద్ మార్కెట్లో ఆ విత్తనం కొనుగోలు కోసం వెళ్లిన వారికి నిరాశే ఎదురైందన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. ప్రధానంగా పది ప్యాకెట్లు కావాలని అడిగితే అందులో రైతు కోరిన విత్తనాలు రెండు మూడు చేతిలో పెట్టి మిగితావి ఇతర విత్తనాలు అంటగట్టారని పలువురు రైతులు చెబుతున్నారు. మార్కెట్లో రెండు రకాల ప్రచారాలు సాగుతున్నాయి. ఆ డిమాండ్ విత్తనం ప్రొడక్షన్ ఈసారి అనుకున్న స్థాయిలో రాకపోవడంతో ఈ పరిస్థితి ఉందని ఒకవైపు చెబుతుండగా, మరోవైపు వ్యాపారులే కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఆదిలాబాద్ మార్కెట్లో ప్రతి యేడాది వ్యాపారులు ఇలాగే చేస్తారని అంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ దృష్టి సారించి దీన్ని నివారించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వానాకాలం సాగుకు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

- కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: వానాకాలం సాగుకు విత్తన, ఎరువుల డీలర్లు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని, ఈ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ముందస్తుగానే సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. వానాకాలం సాగు సన్నద్ధతలో భాగంగా గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని విత్తన, ఎరువుల డీలర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18లోగా విత్తనాల యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని, జిల్లాకు సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. మండలాల పరిధిలో ప్రతీ మంగళ, శుక్రవారం సమావేశాలు జరపాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలనే సరఫరా చేయాలని ఆదేశించారు. డీలర్లు దుకాణానికి సంబంధించిన లైసెన్స్‌లు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. షాపులో ఉన్న స్టాక్ వివరాలను రోజు వారీగా నమోదు చేసి వీటికి సంబంధించిన బిల్ బుక్, రిజిస్టర్లను నిర్వహించాలన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించవద్దని, అలా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గడువు ముగిసిన విత్తనాలు, ఎరువులు అమ్మరాదని, అధికారులు వీటిపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడా కూడా విత్తనాలు, ఎరువుల కొరత ఉండకూడదని, జిల్లాకు సరిపడా విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నకిలీ పత్తి విత్తనాలు సరఫరా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ట్రెయినీ కలెక్టర్ అభిఘ్యాన్ మాల్వియా, వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య, ఏడీఏ రమేశ్, వ్యవసాయాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బోనస్ చెల్లించే వరకూ పోరాడుతాం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న



రోడ్డుపై వడ్లుపోసి నిరసన తెలుపుతున్న నాయకులు

కైలాస్‌నగర్: మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాన్ని విస్మరించిన సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేస్తున్నారని మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆరోపించారు. రైతులకు బోనస్ చెల్లించాలనే డిమాండ్‌తో ఆ పార్టీ తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టారు. కైలాస్‌నగర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి బాబూ జగ్జీవన్‌రాం చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. రహదారిపై వరిధాన్యం పోసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తానని ఎన్నికలకు ముందు ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు సన్నవడ్లకు మాత్రమేనని మాట మార్చడం సరికాదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 80 శాతం రైతులు దొడ్డురకం వడ్లనే పండిస్తున్నారని, 20 శాతం పండిస్తున్న సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామనడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, నాయకులు అజయ్, నారాయణ, రమేశ్, సలీం, దాసరి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా శిబిరాలు విజయవంతంగా నిర్వహించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



క్రీడాకారులతో పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: వేసవి క్రీడా శిబిరాలు విజయవంతంగా నిర్వహించాలని, అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. గురువారం ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం పీవో మాట్లాడుతూ శిబిరాల ద్వారా ఎంతో మంది క్రీడాకారులు వెలుగులోకి వచ్చారన్నారు. గిరిజన విద్యార్థుల్లో సహజసిద్ధంగా నైపుణ్యాలుంటాయని, వాటిని గుర్తించి ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, జిల్లా క్రీడల అధికారి పార్థసారథి, ఏటీడీఓ క్రాంతికుమార్, ఏఎస్ఓ హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, అధికారులు

కైలాస్‌నగర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే డెంగీ వ్యాధి ప్రబలకుండా నియంత్రించవచ్చని, ఆదిశగా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మంగళ, శుక్రవారాల్లో గ్రామీణ ప్రాంతాల్లో డ్రై డే నిర్వహించాలన్నారు. హైరిస్క్ ఏరియాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ స్ప్రే మిషిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. మున్సిపాలిటీలోని 49 వార్డుల్లో ఫాగింగ్ మిషన్ తిరగాలన్నారు. అనంతరం డెంగీ నియంత్రణకు ఉత్తమ సేవలు అందించిన వివిధ శాఖల ఉద్యోగులకు సర్టిఫికెట్స్ అందించి అభినందించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ అభిఘ్యాని మాల్వియా, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, మలేరియా అధికారి శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డీఎల్‌పీవో ఫణీందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల అధికారుల విస్తృత తనిఖీలు



రవీంద్రనగర్‌లో తనిఖీ చేస్తున్న డీఎస్‌వో కిరణ్‌కుమార్

కైలాస్‌నగర్: జిల్లాలోని పలు మండలాల్లోని రేషన్ షాపుల్లో పౌరసరఫరాల శాఖ అధికారులు గురువారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, యూడీఆర్ఐ రవీందర్ ఆదిలాబాద్ పట్టణంలోని పలు షాపులను, బజార్‌హత్నూర్, ఉట్నూర్, మావల మండలాల్లోని షాపులను డిప్యూటీ తహసీల్దార్లు శ్యాంసుందర్, త్రియంబక్‌రావు, ప్రేంనివాస్ తనిఖీ చేశారు. బియ్యం నిల్వలు, రిజిస్టర్లను పరిశీలించారు. డీలర్లు సమయపాలన పాటిస్తూ కార్డుదారులకు సకాలంలో బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు. అక్రమంగా రేషన్ బియ్యం అమ్ముకున్నట్లు తెలిస్తే మాత్రం డీలర్లపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్డుదారులు బియ్యం వండుకుని తినేలా అవగాహన కల్పించాలని సూచించారు.

పేరు రైతుది.. పంట దళారిది

- జొన్న కొనుగోళ్లలో దళారుల దందా
- మహారాష్ట్రలో జొన్నలు కొనుగోలు
- తెలంగాణలో రైతుల పేరిట మార్క్‌ఫెడ్‌కు విక్రయం



బోథ్ మార్కెట్ యార్డులో జొన్నపంట కొనుగోళ్లు

బోథ్: జిల్లాలోని రైతులు ఈ ఏడాది 50 వేల ఎకరాల్లో జొన్నపంట సాగు చేశారు. జిల్లాలోని తొమ్మిది కొనుగోలు కేంద్రాల్లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్న పంట కొనుగోలు చేస్తోంది. ఈ ఏడాది రూ.3,180తో మద్దతు ధర నిర్ణయించారు. ఇదే అదనుగా భావించిన దళారులు మార్కెట్‌లోకి రంగప్రవేశం చేశారు. మహారాష్ట్ర నుంచి జొన్నలు కొనుగోలు చేసి తెలంగాణలో రైతుల పేరిట మార్క్‌ఫెడ్‌కు విక్రయిస్తున్నారు. దీంతో అసలు రైతులు నష్టపోతున్నారు.

ఆన్‌లైన్‌లో ఉంటేనే కొనుగోలు..

వ్యవసాయ శాఖ సిబ్బంది రైతుల పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. వీటి ఆధారంగానే పంట కొనుగోలు చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ సంస్థ స్థానిక ప్రాథమిక సహకార సంఘం సిబ్బంది ద్వారా కొనుగోలు చేయిస్తోంది. ఆన్‌లైన్‌లో పంట వివరాలు లేకపోతే కొనుగోలుకు నిరాకరిస్తున్నారు. అయితే చాలాచోట్ల వ్యవసాయ శాఖ సిబ్బంది పంట క్షేత్రాలకు వెళ్లకుండానే రైతులు చెప్పిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దళారులు, వ్యాపారులు తమకు అనుకూలంగా ఉన్న రైతుల చేత పంట వివరాలు నమోదు చేయిస్తున్నారు.

రైతుల పేరిట విక్రయాలు..

వ్యాపారులు, దళారులు జొన్నపంటను మార్క్‌ఫెడ్‌కు యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. దీనికోసం రైతుల పట్టా పాస్‌బుక్‌లను వాడుకుంటున్నారు. రైతుల పంట క్షేత్రాలకు వెళ్లకుండానే అధికారులు ఆన్‌లైన్‌లో పంట వివరాలు నమోదు చేస్తుండడంతో వ్యాపారులు, దళారులు తమకు అనుకూలంగా ఉన్న కొంతమంది రైతుల పేరిట జొన్న, మొక్కజొన్న, శనగ పంటలను సాగు చేస్తున్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నారు. పంటను ప్రభుత్వం కొనుగోలు చేసే సమయంలో సదరు రైతుల పేరు మీద మార్క్‌ఫెడ్‌కు విక్రయిస్తున్నారు. గ్రామాల్లో కొంతమంది రైతుల వద్ద దళారులు తక్కువ ధరకు పంట కొనుగోలు చేసి అప్పటికప్పుడు డబ్బు చెల్లిస్తున్నారు. దీంతో రైతులు తమ అవసరాల కోసం పంటను వారికి విక్రయిస్తున్నారు. మరి కొంతమంది దళారులు మహారాష్ట్రలో తక్కువధరకు జొన్నలు కొనుగోలు చేసి తెలంగాణలో రైతుల పేరుమీద విక్రయాలు జరుపుతున్నారు.

మార్కెట్‌కు రాకుండానే గోదాంలకు..

వ్యాపారులు, అధికారుల మధ్య ఒప్పందంతో జొన్నలు అసలు మార్కెట్‌కు రాకుండానే లారీల్లో మార్క్‌ఫెడ్ గోదాంలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. వ్యాపారులు కొనుగోలు చేసిన జొన్నలను గోదాంలలో నిల్వ ఉంచుతున్నారు. వ్యాపారులు నిల్వ ఉంచిన జొన్న పంటకు అధికారులు లాట్ నంబర్ కేటాయించి నేరుగా కాంటా చేసిన తరువాత మార్క్‌ఫెడ్ గోదాంకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. తరలించిన వాటికి వ్యాపారస్తులు తమకు అనుకూలంగా ఉన్న రైతుల పేరుతో విక్రయిస్తున్నట్లు సమాచారం. పంట కొనుగోళ్ల మార్కెట్‌కు చెందిన దడ్వాయిల ఆధ్వర్యంలో జరగాల్సి ఉండగా వారు లేకుండానే కొనుగోళ్లు నిర్వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

బోథ్ మార్కెట్ యార్డులో దళారుల ప్రవేశం..

బోథ్ మార్కెట్ పరిధిలో దళారులు జొన్న పంటను మార్క్‌ఫెడ్‌కు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఓ దళారి తన వాహనంలో జొన్నపంటను మార్కెట్ యార్డుకు తీసుకొచ్చాడు. అనుమానం వచ్చిన పలువురు వాహనాన్ని ఆపి ఈ పంట ఎవరిదో చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో రైతుల పట్టా పాస్‌బుక్కులు, ఆన్‌లైన్‌లో సాగు వివరాలు తీసుకురావాలని అధికారులు సూచించారు. పంటను కొనుగోలు చేయకుండా మార్కెట్ యార్డులోనే ఉంచారు. ఈ విషయమై పూర్తిస్థాయి విచారణ జరుపుతున్నామని అధికారులు పేర్కొన్నారు. అయితే చాలా మంది దళారులు రైతుల పేరిట జొన్నపంటను విక్రయిస్తున్నారు. విక్రయించే క్రమంలో దళారులు మార్కెట్ యార్డులోనే ఉంటున్నా సంబంధిత రైతులు మాత్రం ఉండటం లేదు.

క్లుప్తంగా

కంది శ్రీనివాసరెడ్డిపై ఫిర్యాదు



సీఐకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని గంద్రత్ సుజాత వర్గీయులు గురువారం వన్‌టౌన్ సీఐ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్యే నుంచి సుజాత, సంజీవ్‌రెడ్డి డబ్బులు తీసుకున్నట్లు శ్రీనివాసరెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో రాజేశ్వర్, లక్ష్మారెడ్డి, వసీమ్, మధుకర్ ఉన్నారు.

భార్యను వేధించిన కేసులో 18 నెలల జైలు

కైలాస్‌నగర్: భార్యను వేధించిన కేసులో భర్తకు 18 నెలల జైలు శిక్షతో పాటు రూ.2500 జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి కె.ప్రభాకర్‌రావు గురువారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి ఎం. గంగాసింగ్ తెలిపారు. జైనథ్ మండలంలోని నిరాల గ్రామానికి చెందిన మహిళ, మహారాష్ట్రలోని సరత్ తాలూకా ఘటంజి గ్రామానికి చెందిన సావాపురే దీక్షిత్ భార్యాభర్తలు. నిత్యం భార్యను వేధిస్తుండడంతో దీక్షిత్‌పై జైనథ్ పోలీస్ స్టేషన్‌లో వరకట్న వేధింపుల కేసు నమోదైంది. పీసీఆర్ కోర్టులో విచారణ జరుపగా నిందితుడికి 18నెలల జైలు, రూ.2500 జరిమానా విధిస్తూ పీసీఆర్ కోర్టు తీర్పునిచ్చింది.

కుమారుడిపై తండ్రి ఫిర్యాదు

ఎదులాపురం: కుమారుడిపై తండ్రి ఫిర్యాదు చేసిన సంఘటన పట్టణంలోని టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై లాల్‌సింగ్ కథనం ప్రకారం పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన పవన్ అనుమానంతో భార్యపై చేయి చేసుకున్నాడు. కోడలిని ఎందుకు కొడుతున్నావ్ అని అడ్డుకోబోయిన తల్లిదండ్రులపై సైతం చేయి చేసుకున్నాడు. దీంతో అతని తండ్రి నాగోరావు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

స్విమ్మింగ్‌పూల్‌లో స్విచ్‌ల ధ్వంసం



చెల్లాచెదురుగా పడేసిన ఫ్యూజ్‌లు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరా ప్రి యదర్శిని క్రీడా మైదానంలో గల స్విమ్మింగ్ పూల్ కు విద్యుత్ సరఫరా చేసే బోర్డులను గుర్తు తెలి యని దుండగులు ధ్వంసం చేశారు. గురువారం మధ్యాహ్నం రేకుల తలుపును పగులగొట్టి లోపలికి వెళ్లిన దుండగులు స్విమ్మింగ్ పూల్‌కు నీటిని సరఫరా చేసే మోటార్లకు అనుసంధానమైన స్విచ్ బోర్డులు, ఫ్యూజ్‌లను ధ్వంసం చేసి చెల్లాచెదురుగా పడేశారు. వైర్లను సైతం కత్తిరించారు. కాగా అక్కడి అధికారులు, సిబ్బంది దీనిపై ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. దీనిపై డీఎస్‌డీఓ వెంకటేశ్వర్లును 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా ఈ విషయం నా దృష్టికి వచ్చిందని, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

4,28,612 మంది ఓటెయ్యలే..!

- ప్రచారం కల్పించినా కదలని ఓటర్లు
- నిర్మల్ నియోజకవర్గంలోనే అత్యధికం
- ఓటేయని వారిలోనూ మహిళలే అధికం
- ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ తీరు



మావల పోలింగ్ కేంద్రంలో క్యూలో నిల్చున్న ఓటర్లు (ఫైల్)

కైలాస్‌నగర్: ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ కీలకమే. ఆ ఒక్క ఓటే అభ్యర్థుల గెలుపోటములను శాసిస్తోంది. ఎంతోమంది అభ్యర్థుల తలరాతను మార్చి పదవులు వచ్చేలా చేయడంతో పాటు పరాజితులను సైతం చేసి ఇంటికి పరిమితం చేసింది. ఓటు అంతటి శక్తివంతమైనది కనుకే ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఈసీ విస్తృత ప్రచారం కల్పిస్తోంది. ఓటరు బాధ్యతను గుర్తు చేసేలా ప్రముఖులతో వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడంతో పాటు జిల్లా స్థాయిలో స్వీప్ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కల్పిస్తోంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి ఓటింగ్ రోజు వరకు అవగాహన, చైతన్య కార్యక్రమాలను నిర్వహించింది. అయినా ఓటర్లు మాత్రం తమ నిర్లిప్తతను విడనాడలేదు. నా ఒక్క ఓటు వేయకపోతే ఏమవుతుందిలే అనుకున్నారో లేక నాకేందకనే భావనతోనో తెలియదు కానీ చాలామంది ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు కదలలేదు. ఈ నెల 13న జరిగిన ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో 4,28,612 మంది ఓటర్లు ఓటు వేయకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. కారణాలేవైనప్పటికీ ఓటర్ల బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఓటేయకపోవడంలోనూ మహిళలదే రికార్డు

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా మొత్తం 16,50,175 మంది ఓటర్లున్నారు. ఇందులో సోమవారం జరిగిన ఎన్నికల్లో 12,21,563 మంది ఓటర్లు మాత్రమే పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుష ఓటర్లు 8,04,875 మంది ఉండగా 5,99,108 మంది మాత్రమే ఓటుహక్కు వినియోగించుకున్నారు. మరో 2,05,767 మంది పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. అలాగే 8,45,213 మంది మహిళా ఓటర్లుండగా 6,22,420 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. మరో 2,22,793 మంది ఓటేయలేదు. ఇతరులు 87 మంది ఉండగా 35 మంది ఓటు వేశారు. మరో 52 మంది ఓటుహక్కును వినియోగించుకోలేదు. నిర్మల్ నియోజకవర్గంలో అత్యధికంగా 73 వేల మంది ఓటు హక్కు వినియోగించుకోకపోగా, అత్యల్పంగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 55 వేల మంది ఓటర్లు ఓటు వినియోగానికి ఆసక్తి చూపలేదు. కాగా పార్లమెంట్ పరిధిలో అభ్యర్థుల విజయావకాశాలను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నటువంటి మహిళా ఓటర్లు ఓటింగ్‌కు దూరంగా ఉండటంలోనూ రికార్డు నమోదు చేయడం గమనార్హం. ఈ ఎన్నికల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు 17,026 మంది అధికంగా ఓటింగ్‌కు దూరంగా ఉండటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.



నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	ఓటు వేయనివారు
సిర్పూర్	2,29,101	1,63,944	65,157
ఆసిఫాబాద్	2,27,208	1,71,511	55,697
ఖానాపూర్	2,24,523	1,62,101	62,422
ఆదిలాబాద్	2,45,137	1,81,136	64001
బోథ్	2,11,313	1,65,157	46,156
నిర్మల్	2,58,314	1,85,168	73,146
ముథోల్	2,54,579	1,92,546	62,033

అవగాహన కల్పించినా ఆసక్తి చూపలే..

ఓటుకున్న ప్రాధాన్యతను చాటుతూ ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలనే బాధ్యతను గుర్తుచేసేలా స్వీప్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం విస్తృత ప్రచారం కల్పించింది. ర్యాలీలు, రంగోలిలు, యువత, వృద్ధులు, దివ్యాంగుల అవగాహన సదస్సులు, ప్రచార రథాలు వంటి అనేక విధాలుగా అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక వసతులను సైతం కల్పించింది. అయినా ఓటర్లు పట్టించుకోలేదు. కేంద్రాలకు తరలివచ్చి ఓటుహక్కును వినియోగించుకోలేదు. పల్లెలతో పోల్చితే పట్టణ ప్రాంతాల్లోనే ఈ పరిస్థితి ఎక్కువగా కన్పిస్తోంది. నిరాక్షరాస్యులు, ఆదివాసీలు ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం 78 నుంచి 82 శాతం వరకు నమోదు కాగా విద్యావంతులు, చైతన్యం కలిగిన వారుండే పట్టణ ప్రాంతాల్లో 60 శాతం కూడా పోలింగ్ నమోదు కాకపోవడం పట్టణ ప్రాంతాల్లోని ఓటర్ల బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది. యువ ఓటర్లు సైతం ఓటరుగా పేర్ల నమోదుపై చూపుతున్న శ్రద్ధ తీరా ఓటుహక్కు వినియోగించుకోవడంపై చూపడం లేదు. 4 లక్షల మంది ఓటర్లు పోలింగ్‌కు దూరంగా ఉండటం రాజకీయ పార్టీలతో పాటు అధికార యంత్రాంగాన్ని సైతం ఆలోచింపజేసేలా చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లోనైతే ఇవే ఓట్లు ఐదు అభ్యర్థుల తలరాతలను మార్చగలవు. వజ్రాయుధంగా చెప్పుకునే ఓటుహక్కుకు ఇంత పెద్ద స్థాయిలో ఓటర్లు దూరంగా ఉండటం నిజంగా విస్తుగొలిపే అంశంగానే భావించవచ్చు.

గాలివాన బీభత్సం



కాలనీ రోడ్డుపై విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు

గుడిహత్నూర్/ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో గురువారం గాలివాన బీభత్సం సృష్టించింది. జోరుగా వీచిన గాలితో రహదారిపై చెట్లు పడిపోగా, హనుమాన్ నగర్‌లోని పలు ఇళ్లు, దుకాణాల పైకప్పు రేకులు లేచి పోయి దూరంగా పడ్డాయి. దీంతో నిత్యావసర సరుకులు, సామగ్రి తడిసిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఆర్ఐ అరుణ్ బాధిత ఇళ్లను సందర్శించి నష్టం అంచనా వేశారు. ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఇంద్రవెల్లి మండలంలోని మండలంలోని ఈశ్వర్‌నగర్ సమీపంలో ప్రధాన రహదారిపై చెట్టు పడిపోవడంతో సుమారు గంట సేపు రాకపోకలు నిలిచిపోయాయి. ఉట్నూర్ నుండి ఆదిలాబాద్ వెళ్తున్న మాజీ ఎంపీ గోడం నగేష్ వాహనం కూడ ఆగిపోయింది. ఎస్సై దుబ్బక సునీల్ సంఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సాయంతో చెట్టును తొలగించారు.



దుకాణం పైకప్పు లేచి పోవడంతో తడిసిన సరుకులు

సాకెరలో చోరీ

బోథ్: మండలంలోని సాకెర గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రాథోడ్ రాయల్ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం..రాథోడ్ రాయల్ కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 14న సారంగపూర్ మండలంలోని లింగాపూర్ వెళ్లాడు. గురువారం ఉదయం తాళం తీసి ఉండడాన్ని గమనించిన గ్రామానికి చెందిన రాథోడ్ రంజిత్ ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. గ్రామానికి చేరుకున్న రాయల్ ఇంట్లోకి వెళ్లి చూడగా రెండు బీరువాల తలుపులు తెరిచి ఉన్నాయి. అందులో ఉన్న 8 గ్రాముల బంగారు, 40 తులాల వెండి ఆభరణాలు, రూ.15 వేల నగదు కనిపించలేదు. వెంటనే ఎస్సై రాముకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధికోసం వచ్చి తిరిగిరాని లోకాలకు..

- ద్విచక్రవాహనంతో తాటిచెట్టును ఢీకొని బావ మృతి
- గాయాలపాలైన బావమరిది

సారంగపూర్: ఉపాధి కోసం అత్తగారి గ్రామానికి వచ్చి జీవనోపాధి పొందుతున్న ఓ యువకుడిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. ఈ ఘటన మండలంలోని కౌట్ల(బీ) గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. కుభీర్ మండలం హాల్దా గ్రామానికి చెందిన శంకర్ (35)కు మండలంలోని కౌట్ల(బీ) గ్రామానికి చెందిన గజ్జవ్వతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కూతురు, కుమారుడున్నారు. స్వగ్రామంలో ఉపాధి కరువై శంకర్ తన అత్తగారి గ్రామమైన కౌట్ల (బీ)కి కుటుంబంతో ఐదేళ్ల క్రితం వచ్చాడు. ఓ ఇంటిని అద్దెకు తీసుకుని కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం కూలీ పనులు ముగించుకుని పని నిమిత్తం సారంగపూర్‌కు తన బావమరిది కుంటాల నరేశ్ (24)తో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. తిరిగి వస్తుండగా కరుణాకర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్ సమీపంలో తాటిచెట్టుకు ద్విచక్రవాహనంతో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. నరేశ్‌కు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు 108లో నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కాగా, శంకర్ మృతితో అతడి కుటుంబం వీధినపడింది. నరేశ్‌ది పేద కుటుంబం కావడంతో మెరుగైన వైద్యం చేయించే స్తోమత వారికి లేదు. శంకర్ మృతదేహాన్ని అతడి స్వగ్రామం కుభీర్ మండలం హాల్దాకు తరలించారు. శంకర్ మృతితో బాధిత కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీ

- పలువురికి గాయాలు

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా నుంచి మద్యం లోడుతో ఐచర్‌వాహనం, నిర్మల్ వైపు నుంచి మామిడి కాయల లోడ్‌తో భైంసా వైపు వస్తున్న మరో ఐచర్ వాహనం తిమ్మాపూర్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మామిడి కాయల లోడ్‌తో వెళ్తున్న వాహన డ్రైవర్ అమ్జద్‌ఖాన్, మద్యంలోడ్‌తో వెళ్తున్న వాహన డ్రైవర్ శంకర్‌తోపాటు దీక్షిత్, సందీప్, వంశీకి గాయాలయ్యాయి. స్థానికులు వీరిని భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. బాధితుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వానల్‌పాడ్ గ్రామంలో ముగ్గురికి..

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామ సమీపంలో గురువారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామస్తులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. వానల్‌పాడ్ గ్రామానికి చెందిన శ్రీనివాస్, రుక్మా ద్విచక్రవాహనం వెళ్తూ యూటర్న్ తీసుకుని గ్రామంలోకి వెళ్తుండగా కుంటాల మండలం కల్లూరు గ్రామం నుంచి భైంసాకు ద్విచక్రవాహనంపై వస్తున్న వంశీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను భైంసా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయాలపాలైన నగేష్

నేరడిగొండ: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన అడిగం నగేష్ జాతీయ రహదారి పక్కనుంచి వెళ్తుండగా ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. గమనించిన స్థానికులు 108లో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బోథ్: మండలంలోని పొచ్చెర బ్రిడ్జి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నేరడిగొండ మండలంలోని పెద్ద బుగ్గారం గ్రామానికి చెందిన ఆడె లక్ష్మణ్, విష్ణు బోథ్ మండలంలోని కంటెగాంలో ఓ పెళ్లి వేడుకకు గురువారం ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో పొచ్చెర బ్రిడ్జి వద్ద కారును తప్పించబోయి రోడ్డుపై పడిపోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా బోథ్‌లోని ప్రధాన ఆస్పత్రికి, అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం నిర్మల్‌కు తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



ఘటనా స్థలంలో అనిల్ మృతదేహం

కడెం: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మ్యాడరపు అనిల్ (25) మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కొత్తపేట్ గ్రామానికి చెందిన అనిల్ లక్ష్మీపూర్‌లో జరిగిన ఓ శుభకార్యానికి హాజరయ్యాడు. బైక్‌పై గ్రామ శివారులోకి వచ్చిన అనిల్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ప్రమాద స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

సినిమా థియేటర్లకు విశ్రాంతి

- పది రోజులపాటు ప్రదర్శనల నిలిపివేతకు ఎగ్జిబిటర్ల నిర్ణయం
- చిన్న సినిమాలకు తగ్గుతున్న ప్రేక్షకాదరణ
- సిబ్బందికి జీతాలు, కరెంటు బిల్లు వెళ్లలేని పరిస్థితులు
- వేసవిలో విడుదలకు నోచుకోని అగ్రహీరోల సినిమాలు



బెల్లంపల్లిలో ప్రదర్శనలు నిలిపేసిన ఓ థియేటర్

బెల్లంపల్లి: సామాన్య, నగటు ప్రేక్షకులకు అతి తక్కువ ధరలో వినోదం అందిస్తున్న సినిమా థియేటర్లు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. జిల్లాలోని పలు థియేటర్లు ప్రేక్షకులు రాక.. ఆటలు ప్రదర్శించే పరిస్థితులు లేక నష్టాలు చవి చూస్తున్నాయి. కాసులు రాబట్టుకునే సమయంలో ఈసారి కొత్త సమస్య ఎదుర్కొంటున్నాయి. విద్యాసంస్థలకు వేసవి సెలవులు ప్రకటించిన తర్వాత వరుసగా అగ్రహీరోల సినిమాలు పోటాపోటీగా విడుదల కావాల్సి ఉండగా ఈ దఫా ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. దాదాపు మూడు నెలల నుంచి ప్రముఖ నటుల సినిమాలు కానరాకుండా పోగా, కొందరు హీరోల సినిమాలు నిర్మాణ దశల్లో, పోస్టు ప్రొడక్షన్ పనుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో నూతనంగా నిర్మిస్తున్న సినిమాల విడుదలకు ప్రతిబంధకాలు ఏర్పడగా థియేటర్లలో ప్రదర్శనలు జరగని పరిస్థితులు ఏర్పడ్డాయి.

జిల్లాలో ఇలా..

జిల్లాలో మంచిర్యాల, సీసీసీ, చెన్నూర్, లక్సెట్టిపేట, బెల్లంపల్లి, తాండూర్, జన్నారంలో మొత్తంగా 13 సినిమా థియేటర్లు ఉన్నాయి. మంచిర్యాలతోపాటు ఇతర ప్రాంతాల థియేటర్లలో సినిమాల ప్రదర్శలు సరిగా జరగక సంక్లిష్ట పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ప్రభావంతో కొన్నాళ్ల క్రితం నుంచే థియేటర్లు మూసివేతకు గురవుతూ వస్తున్నాయి. బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల, సీసీసీ నస్పూర్, లక్సెట్టిపేట, మ్యాదరిపేటలో ఉన్న 8 థియేటర్లు మూతపడ్డాయి. ప్రేక్షకాదరణ లేక, లాభాలు రాకపోగా కనీసం సిబ్బంది వేతనాలు, విద్యుత్ బిల్లులు సైతం చెల్లించేందుకు ఆర్థిక ప్రతికూల పరిస్థితులు తలెత్తి అనివార్యంగా మూసివేశారు. వీటిలో కొన్నింటిని ఫంక్షన్ హాళ్లుగా మార్చగా, మరికొన్ని వృథాగా మారి నాటి దర్పానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

తాజా పరిస్థితుల ప్రభావం

కొత్త సినిమాల జాడ లేకపోవడంతో తాజాగా పది రోజులపాటు సింగిల్ స్క్రీన్ థియేటర్లను బంద్ చేయాలని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం నుంచి ఆయా థియేటర్ల గేట్లకు తాళం పడనుంది. చిన్నాచితక సినిమాలను ప్రదర్శించినా సరిగా కలెక్షన్లు రాక నష్టాలపాలయ్యే కన్నా పెద్ద హీరోల సినిమాలు విడుదల అయ్యాకనే తెరవాలని నిర్ణయం తీసుకుంది.

సాంకేతికత పెరిగి..

సాంకేతిక రంగం విస్తరించి ఇళ్లలో ఓటీటీలు, స్మార్ట్ ఫోన్లు అందుబాటులోకి రావడంతో సినిమా థియేటర్లకు ఆదరణ కరువవుతోంది. థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య రోజురోజుకు తగ్గుతూ వస్తోంది. ఎగ్జిబిటర్స్ నిర్ణయానికి ముందే బెల్లంపల్లిలో ఓ ప్రముఖ సినిమా థియేటర్ గత వారం నుంచే ప్రదర్శనలు నిలిపివేసింది.

చిన్న సినిమాలు నడవడం లేదు



సినిమా టాకీసుల్లో చిన్న సినిమాలకు ప్రేక్షకాదరణ ఉండడం లేదు. సరైన కలెక్షన్లు రావడం లేదు. రోజుకు గరిష్టంగా కనీసం రూ.8 వేలకు తగ్గకుండా ఆదాయం రావాలి. కానీ రూ.5 వేలకు లోబడి వస్తున్నాయి. సిబ్బందికి జీతాలు చెల్లించలేని, కరెంట్ బిల్లు కట్టలేని పరిస్థితులు ఉంటున్నాయి. కలెక్షన్లు లేక మా థియేటర్‌లో వారం రోజుల క్రితం నుంచి ప్రదర్శనలు నిలిపేశాం. డిస్ట్రిబ్యూటర్ల మధ్య పోటీతో థియేటర్లకు ముప్పు వాటిల్లే పరిస్థితులు ఏర్పడ్డాయి. సిబ్బంది వీధిన పడకుండా ఇతర డిస్ట్రిబ్యూటర్లకు అవకాశం కల్పించాలి. ఇందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

– సయ్యద్ కమర్ పాషా, సినిమా థియేటర్ మేనేజర్, బెల్లంపల్లి

కనీస ఖర్చులు రావడం లేదు



సినిమా థియేటర్ల నిర్వహణ భారంగా మారింది. రోజువారీగా సినిమా వేస్తే కనీస ఖర్చులు కూడా రావడం లేదు. లాభం రాకపోగా నష్టాలను చవి చూడాల్సి వస్తుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో షోలను నిలిపి వేయాల్సి వస్తోంది. నష్టాల బాట పట్టిన థియేటర్ల సమస్యలను ప్రభుత్వం పట్టించుకుని తగిన చర్యలు తీసుకోవాలి.

– ఎర్ర సంపత్, రాఘవేంద్ర థియేటర్ యాజమాని, జన్నారం

భార్య కాపురానికి రావడంలేదని ఆత్మహత్య

గుడిహత్నూర్: భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మన్నూరులో చోటు చేసుకుంది. ఎస్సై ఇమ్రాన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మన్నూర్‌కు చెందిన బస్వంతె బ్రహ్మానంద్(38), అనిత దంపతులు బీసీ కాలనీలోని అద్దె ఇంట్లో ఉంటున్నారు. వివాహమై పదహారేళ్లు కావస్తున్నా సంతానం కలుగలేదు. వారం రోజుల క్రితం ఇద్దరి మధ్య గొడవ జరగడంతో అనిత పుట్టింటికి వెళ్లింది. భార్యను తీసుకొద్దామని బ్రహ్మానంద్ బుధవారం ఇంద్రవెల్లి మండలం సట్వాజీగూడలోని అత్తారింటికి వెళ్లాడు. రావడానికి నిరాకరించడంతో సాయంత్రం మన్నూర్‌కు వచ్చి మద్యం సేవించాడు. మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. స్థానికులు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన పోతన్న(30) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. పోతన్న గ్రామంలో వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని భైంసా ఏరియాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. పోతన్నకు భార్య సావిత్ర, ఇద్దరు కుమారులున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలో గురువారం రాత్రి గు ర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. అటవీ ప్రాంతం నుంచి కాగజ్‌నగర్– సిర్పూర్(టి) ప్రధాన రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక అక్కడిక్కడే మృతి చెందింది. వాహనాదారులు అందించిన సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

దేశీదారు పట్టివేత

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని సుభాష్ కాలనీలో గురువారం దేశీదారు మద్యం పట్టుకున్నామని కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ వి.రవి తెలిపారు. సుభాస్ కాలనీలో కె.అరుణ్‌కుమార్ దేశీదారు మద్యం అమ్ముతుండడంతో 56 దేశీదారు 90 మి.లీ. బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అరుణ్‌కుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు. నలుగురు పాత నేరస్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని వెల్లడించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

తానూరు: మండలంలోని హంగిర్గా గ్రామ శివారులో గురువారం పేకాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వారి నుంచి రూ.11,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.